ఈవారం కథ

వణికించే హేమంతంలో ఓ నిశిరాతిరి. నిదురమ్మ ఒడిలో ఆదమరచిన నేను క్షణాలు, నిముషాలు, గంటలు ఎన్ని గడిచాయో తెలీదుగానీ రోడ్డుమీద వెళ్తున్న ఫైరింజన్ గంటల గణగణ నా నిద్రను చెదరగొట్టింది. మెయిన్ రోడ్డుకు దగ్గరగా ఉండటంలో ఉన్న బాధల్లో ఇదొకటి. పగలూ, రాత్రీ యాంత్రిక సందడి. అలారాం పీస్ కేసి ఆరాగా చూశాను. రెండయింది.

ఇష్! ఇక ఈ రాత్రికి నా కంటికి నిద్ర కరువే. అదేమిటో నాకు ఒకసారి మెలకువ అంటూ వస్తే మళ్లీ నిద్ర ఒక పట్టాన పట్టదు. నిద్ర పట్టడం లేదంటే ఊసులు చెప్పి లాలించే శ్రీమతి గుర్తుకొస్తోంది. వాళ్లన్నయ్య తిరుపతిలో కళ్యాణం చేయిస్తున్నాడంటే పిల్లల్ని తీసుకువెళ్లింది. తను ఆఫీసులో ఇన్‌స్పెక్షన్ ఉందని వంకచెప్పి ఉండిపోయాడు. ఏం చేయాలిప్పుడు?

ఎదురుగా ఉన్న పుస్తకాల రేక్‌మీద నా చూపు నిలిచింది. నా చూపులు నా మనోగతానికి (డైరీకి) అతుక్కుని విడివడకపోవడంతో చూపులు మనసును, మనసు మెదడును ఎప్పుడు ఆదేశించాయో తెలీదు కానీ నా చేయి అప్రయత్నంగా డైరీని అందుకుంది. లక్ష్మి దీన్ని 'బృహత్కథామంజరి' అని ఆటపట్టిస్తూ ఉంటుంది. డిమ్‌లైట్లో కూడా నా చూపుకు, నా చేతికీ ఇట్టే దొరికిందీ అంటే అది నా మనోగతం కాబట్టే. టేబుల్ లైట్ ఆన్ చేసి డైరీ తెరిచాను.

ఆదివారం : జనవరి 1, 1990

కొత్తసంవత్సరమని మా ఇంటిమహాలక్ష్మి చేసిన హడావుడి ఇంతా అంతా కాదు. అర్ధరాత్రి సరిగ్గా పన్నెండున్నరకు తట్టిలేపి హేపీ న్యూ ఇయర్ చెప్పింది. పిచ్చిలక్ష్మి. ఎన్ని జనవరి ఒకట్లు రాలేదు, పోలేదు. జనవరి రెండోవారం నుంచి ఓల్డ్ ఇయర్ ఫీలింగ్ రానే వస్తుంది.

సంవత్సరం మారితే మాత్రం, జీవితంలో ఏం కొత్తదనముంది? పొద్దున్నే పాలవాడి కేక. ఆపైన పిల్లల గోల. బస్సులవేట, సాపాటు పాటు, మధ్యలో ఎదుటివాడి గురించి, పక్కవాడి గురించి, ప్రపంచం గురించి, బాసు గురించి, వాడి బాబు గురించి ... అంతా అయ్యాక గూటికి చేరుతూ బాటతెలీని రూటుల్లో బతుకు గతుకులను ఆలోచనలతో తాకుతూ, తడబడుతూ మళ్లీ ఇల్లూ ... ఇల్లాలు. ఖాళీ అయిన కడుపు ట్యాంక్‌ను నింపి, దోమలకు శరీరాన్ని అప్పగించి, ఆవలిస్తూ సోలిపోవడం. అదిగో, నిదురమ్మ పిలుస్తోంది.

సోమవారం : జనవరి 2, 1990

నా బతుకుకూ బస్సులకూ ఎంతో పోలిక ఉన్నట్లు కనిపిస్తోంది. బహదూరపు బస్సుసారినయినప్పటి నుంచీ ఎన్నెన్ని అనుభవాలు. కనీసం ఎస్.ఆర్ నగర్ దాకా అయినా చేరుదామంటే 190 బస్సు ఎంతకూ రాదు. అవునూ ... 45 బస్సు పక్క సందులోంచి మలుపు తిరిగి వెళుతుంది కదా, అదయినా వస్తుంటే దాని జాడలేదు సరికదా ఇందాక అటువైపు బోర్డు లేకుండా ఉన్న బస్సే కాబోలు 190 X నంటూ బోరవిరచుకు వెక్కిరిస్తూ ఇందిరా పార్క్ వైపు పరుగులు పెట్టింది. నూటపదమూడు వస్తుందేమో అని ఆశపడి రోడ్డుదాటి నిలబడ్డా. అదీ రాలేదు. ఇంతలో 45 బస్సు రోడ్డుకు అటువైపు ఉండగానే జనం ఎక్కేశారు. నేనూ వెళదామంటే మధ్యలో మాంఛి ట్రాఫిక్. ఎలాగో రోడ్డుదాటా. ఇంతలో వాడు నన్ను పట్టించుకోకుండానే బస్సు వేగం పెంచి దాటిపోయాడు. వెళుతున్న దాన్ని చూస్తూ నిట్టూరుస్తూ ఉండగానే 113 బస్సు అటునుంచి దూసుకుపోయింది.

నాలుగు రోడ్ల కూడలిలో నా జాతకం మీద ఉన్న నా నమ్మకం మరోసారి రుజువై దృఢపడింది. నా జీవితమంతా ఆ ఒక్క బస్సు వేటతో పోల్చుకోవచ్చునని పిస్తోంది. అదేమిటో, నిద్రలో కూడా బస్సుల గొడవే. హారన్ చప్పుళ్లు. ఉలికిపాట్లు. ఆర్టీసీ జిందాబాద్!

మంగళవారం : జనవరి 3, 1990

ఇవాళ మధు కనిపించాడు. వాడేమీ మారినట్లు లేదు. వాడిలో ఎప్పుడూ హుషారు ఉరకలువేస్తూ ఉంటుంది. అసలెందుకు బాధపడాలి? అన్నది వాడి ప్రశ్న. అయితే బాధపడడం, పడకపోవడం అనే వాటిని మనమే నియంత్రించగలమా అన్నది నా సమస్య. డబ్బులేకపోతే అప్పుచెయ్. ప్రపంచమే అభివృద్ధి పథమంటూ అప్పుమార్గంలో నడుస్తుంటే ఆఫ్టరాల్ నువ్వెంత? అప్పు చేయమంటే బ్యాంక్ లూటీ అన్నంత బాధపడతావ్ అంటాడు. పైగా నన్ను 'మానసికరోగి' అని తేల్చేశాడు. పోన్లే... డబ్బుతో పనిలేని రోగమే కదా. అందుకైనా సంతోషిస్తా. ఈ మనసుకూడా మూగదైతే నాకెవరు తోడు?

బుధవారం : జనవరి 4, 1990

జీవితంలో ఓ భాగం ఆఫీస్ అంటే మధులాగే లక్ష్మికూడా ఒప్పుకోదు. ఎప్పటికప్పుడు జరిగే సంఘటనలూ, నా మనసు నొచ్చుకున్న సందర్భాలు, మాటలు, నిరాశ కలిగే క్షణాలు. ఏవైనా ఇవేవీ నావి కావంటూ ఆఫీస్ గేటులోపలే వదిలిరావడం తనకు సాధ్యమయ్యే పనికాదు. తను మౌనంగా ఉంటే లక్ష్మి కారణం చెప్పేదాకా ఊరుకోదు. తీరా చెప్పాక నాతో సమానంగా ప్రతిస్పందిస్తూ 'మీరు ఇలా చేయాల్సింది' అంటూ ఆవేశపడుతుంది. ఆ తర్వాత 'అయినా ఇంటికి వచ్చాకకూడా ఆ తలనొప్పి' ఎందుకు? కాస్త మా గురించికూడా ఆలోచించండి అంటుంది. లక్ష్మి చెప్పే పరిష్కారాలు విన్డానికి బాగానే ఉన్నా ఆచరించడానికి నాలోవున్న సెన్సిటివిటీ అడ్డుపడుతుంది. అదేమాట చెబితే మీకు బతికున్న వాడెవడూ చెప్పలేడని విసుక్కుంటుంది.

ఎక్కడికక్కడ ఆలోచనలను, అందులోనూ మనసును కదిలించిన వాటిని వదిలేయడం ఈ జన్మకు తనకురాదు. రోజులు గడిస్తే తీవ్రత తగ్గుతుందేమో కానీ మళ్లీ గుర్తుకొస్తే అది కొత్త గాయంలాగే బాధపెడుతుంది. అది మరి తన బలహీనతో, బుద్ధిహీనతో?

గురువారం : జనవరి 5, 1990

జ్వరం వచ్చింది. చాలా రోజుల తర్వాత నేను గుర్తుకువచ్చాను కాబోలు. జ్వరం వస్తే నాకో సుఖం ఉంది. అదిలక్ష్మి చూపించే ప్రేమ. అసలు కనీసం ఓ నెలరోజులు జ్వరం వస్తే బాగుండు. ఈమాట చెబితే మాటలతో యుద్ధం చేస్తుంది. అదిగో! జ్వరం వచ్చి ఏమిటారాతలని కసురుతోంది. అమ్మో. వచ్చేస్తుంది. గప్‌చిప్.

శుక్రవారం : జనవరి 6, 1990

'డేడీ, అక్క చూడు ఏమంటోందో. నీ పెళ్లి తనేమో చూసిందట. కానీ నేనేమో చూడలేదట. అంతా అబద్ధం కదూ!' దగ్గరికి వచ్చి అడిగింది జ్యోతి. నాకు వెంటనే నవ్వు వచ్చింది. అయినా ఆపుకుంటూ లేదమ్మా, రాత్రి కదా..ఇద్దరూ నిద్రపోయారని నేను చెబుతుంటే లక్ష్మి ముసిముసిగా నవ్వింది. జ్యోతి, ధరిత్రి వేసే ప్రశ్నలకు ఒక్కొక్కసారి జవాబు చెప్పడం కష్టంగా ఉంటుంది. ఈ యాంత్రికమైన జీవితంలో వాళ్లే మాకు ఆనందపు జల్లులు.

శనివారం : జనవరి 7, 1990

పొద్దునెందుకో లక్ష్మిమీద చిరాకు పడ్డాను. నిజానికి పెద్ద కారణమేమీ లేదు. అసలు ఒక్కోరోజు చిరాకుగా, దిగులుగా ఎందుకుంటుందో తెలీదు. అయితే చిత్రం ఏమిటో కానీ ఆ రోజులో ఎప్పుడో ఒకప్పుడు ఏదో చెడు, చిన్నదో పెద్దదో జరిగే తీరుతుంది. నా మూడ్‌కు, దానికీ ఏదో సంబంధం ఉందీ అనుకుంటే మళ్లీ అది సెంటిమెంట్ అవుతుందేమో. ఏమైనా నా సంతోషాన్ని, దిగులును, కోపాన్ని, మౌనాన్ని అన్నిటిని భరించే లక్ష్మిని నిజంగానే మెచ్చుకోవాలి. నామీద నేను చిరాకుపడే క్షణాల్లో కూడా లక్ష్మి చూపించే అభిమానం ఇంతా అంతా కాదు. మనసులో ఇంతగా అనుకున్నా అదేమిటో మళ్లీ చిరాకు పడే సమయాల్లో తనను తాను కంట్రోల్ చేసుకోలేకపోతున్నాడు. తర్వాత సారీ చెబితే మీరెంత పిచ్చివారండీ అంటుంది పిచ్చిది.

ఆదివారం : జనవరి 8, 1990

అన్నయ్యకు ఎలాగైతేనేం ఉత్తరం రాశాను. మొక్కుబడిగా ఉత్తరం రాయడం తనకు చిరాకు. క్షేమం, క్షేమం అంటూ ఎందుకా బుకాయింపులు. చిన్నప్పుడు ఎలావుండే వాళ్ళు తమూ, అన్నయ్యా. అదేమిటో ఇప్పుడు తమ మధ్య కనిపించని అడ్డుగోడలూ, అగాధాలూ. వ్యక్తిత్వాలమధ్య సంక్లిష్టత. ఒక గూట్లో పుట్టి ఎగిరిపోయిన విహంగాల్లా ఉంది తమ పని. ఇప్పుడు ఎవడి గూడు వాడిది. ఎవడి గోడు వాడిది. మొరాలిటీ లేని ఫార్మాలిటీస్ తనకు నచ్చవు. వాళ్లకవే ప్రధానం. కనిపించినప్పుడు మాత్రం మనసులో అనుబంధాల తలుపు చటుక్కున తెరుచుకుంటూ ఉంటుంది. అదే చిత్రం.

సోమవారం : జనవరి 9, 1990

ఇవాళ చాలా హేపీగా ఉంది. ఎందుకంటే జయకాంత్ అమెరికా నుండి ఉత్తరం రాశాడు. ఇన్నాళ్లయి నా మదర్ ఇండియాను, నన్నూ మరిచిపోలేకుండా ఉన్నాట్ట. వెధవరాతా, వాడూ. ఉర్దూలాగా ఉంటుంది వాడి ఇంగ్లీష్ రైటింగ్. అసలు వాడి లెటర్‌ను ఉర్దూ వచ్చిన వాళ్లకు చూపిస్తే కొత్త అర్థాలు చెబుతారేమో? నా అయిడియాకు నాకే నవ్వొస్తోంది. స్నేహానికి మంచి నిర్వచనం జయకాంత్. లేకపోతే తనెక్కడా, వాడెక్కడా? ఉత్తరాల్లో కూడా స్నేహం తప్పించి మరొకటి తొంగిచూడదు. నాకున్న రెండు ఎసెట్స్‌లో ఒకటి లక్ష్మి, రెండు జయకాంత్. మే గాడ్ బ్లెస్ హిమ్.

మంగళవారం : జనవరి 10, 1990

ఇవాళ సెలవు పెట్టాను. పిల్లల్ని ఎన్నాళ్లనుంచో హోటల్‌కు తీసుకువెళతానని ఊరిస్తున్నాను కదా అని తీసుకువెళ్ళాను. ఓ వంద ఖర్చయితే అయింది కానీ వాళ్ల మొహాల్లో ఎంత ఆనందపు వెలుగు. అంతకన్నా తనకేం కావాలి. సాయంత్రమంతా టేప్‌రికార్డర్‌లో పాత పాటలు వినడంతో సరిపోయింది. ఇంక మళ్లీ రేపట్నుంచీ నా బస్సు, నా రొటీన్. అసలు హాయిగా ఓవారం ఎటన్నా వెళ్తేబాగుండు. మరి లక్ష్మి. తిరుపతి వెళ్తోంది కాబట్టి ఇప్పట్లో బడ్జెట్ ఒప్పుకోదు.

బుధవారం : జనవరి 11, 1990

లక్ష్మి, పిల్లలు ఊరికి వెళ్లారు. ఇంటికి వస్తే ఎటుతిరిగినా నా నీడే. ఏదో దిగులు. ఎంత సేపని. టీ.వి, పుస్తకాలు నన్ను ఆదుకుంటాయ్? బంధనాల్లోనే బాధలూ, బాధల్లోనే సంతోషమూ ఉన్నాయేమో. పడుకుంటేమనసేమో గతాల లోగిళ్లలోకి పరుగెడుతుంది.

నిన్న గతం. నేడు రేపటికి గతం. రేపు ఎల్లుండికి గతం. ప్రతిరోజూ గతం ఖాతాలో కలిసేదే. తెల్లవారితే ఈ రాత్రీ గతమే. నా మనోగతం మళ్లీ గతంలో చిక్కుకోకుండా ఉండాలంటే మళ్లీ పుస్తకాన్ని ఆశ్రయించాలి.

గురువారం : జనవరి 12, 1990

పొద్దుటినుంచీ ఒకటే వాన. చాలాసార్లు తడిశాను. బస్సుల్లో జనం అంతగా లేరు. ప్రాణానికి హాయిగా అనిపించింది. హోటల్లో టిఫిన్ చేసి వచ్చేశాను. ఇంట్లో వండుకోవాలంటే బద్దకం. రెండు, మూడుసార్లు టీ కలుపుకు తాగాను.

ఈ వర్షపురాత్రి టీ తాగుతూ, కిటికీ నుంచి వర్షపు జోరును, నింగీ నేలా అందాలనూ ఆస్వాదిస్తూ కూచోవడం ఎంతో థ్రిల్లింగ్‌గా ఉంది. వానలనేవి రాత్రి కురిసి, తెల్లవారి మాయమైతే చాలా బాగుంటుంది. ఇవన్నీ ఎవడి కంట్రోల్లో ఉంటాయో తెలిస్తే నేను ఓ సజెషన్ పడేద్దును.

శుక్రవారం : జనవరి 13, 1990

ఈ రోజు, రేపు పండగ సెలవులు. ఎల్లుండి ఎలాగూ ఆదివారం. లక్ష్మి వాళ్లు రేపొద్దునే వచ్చేస్తారు. మళ్లీ ఇల్లంతా హడావుడి. నా జీవితం నలభై ఓల్టుల బల్బులా ఉన్నా లక్ష్మి మాత్రం 'సంక్రాంతి' అంటూ తెగ హడావుడి చేస్తుంది. నిజంగా సంక్రాంతి ఏమీ లేకపోయినా ఇల్లంతా 'సమ్‌క్రాంతి'గా చేసేస్తుంది లక్ష్మి.

నా మనోగాన మననం అక్కడ ఆగింది. నా మనసులోని ఆరోహణ, అవరోహణలు పేరిస్తే నా డైరీ పలికే చిత్ర సంగీతం ఓ సగటు మానవుడి బతుకు గీతం. మస్తిష్కానికి పవర్ తగ్గుతోంది. మెదడు వేడెక్కి కలలగీతం పాడుకోవడానికి తొందరపడుతోంది. ఆ... ఆవలింత ఆహ్వానం పలికింది.